క్లుప్తంగా

కల్కి అవతారంలో జగన్నాథుడు


కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: దుష్ట సంహారం నిమిత్తం అశ్వవాహనంపై బయలుదేరిన కల్కి అవతారంలో జగన్నాథ స్వామివారు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో డాలు ధరించి అశ్వవాహనం ఎక్కి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ నిమిత్తం కల్కి భగవానుడు అవతారంలో ఉన్న జగన్నాథుడిని పలువురు భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథ రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన డైవర్షన్ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు మొరాయించింది. డైవర్షన్ రహదారి వద్ద ఎత్తుగా ఉన్న ప్రాంతంలో బస్సు ఎక్కలేక నిలిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం టిప్పర్‌కి తాళ్లను కట్టి బస్సును ప్రధాన రహదారిపైకి చేర్చారు. ప్రతి రోజూ జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయిగూడెం మీదుగా రెడ్డిగణపవరం బస్సు వెళ్లుతుందని, డ్రైవర్, కండక్టర్ కొత్తవాళ్లు కావడంతో అవగాహన లోపంతో తిరుగు ప్రయాణంలో పట్టిన్నపాలెం మీదుగా వెళ్లడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి పెట్టండి

కొయ్యలగూడెం: అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని రాష్ట్ర కన్స్యూమర్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని కేజీ రూ.14 వరకు ప్రజల నుంచి కొనుగోలు చేసి అక్రమ బియ్యం రవాణాదారులు రైస్ మిల్లర్స్‌కి తరలిస్తున్నారని తెలిపారు. రైస్ మిల్లర్లు అదే బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కేజీ బియ్యం రూ.40 నుంచి రూ.50 వరకు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన బియ్యం అక్రమ రవాణాదారులు చట్టంలోని లొసుగుల వల్ల బయటపడి తిరిగి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ సెక్రటరీకి, సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు లేఖలు రాసినట్లు ఆయన తెలిపారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. నవజాత శిశువు మృతదేహం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో లభించింది. శిశువు మృతదేహం కనిపించడంతో స్థానికులు సైతం చలించిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక 10వ వార్డు సచివాలయం పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మున్సిపల్ వర్కర్ వెంకటేశ్వరరావు పారిశుధ్య పని నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు మార్జిన్‌లో నెలలు నిండని గర్భంలో 7 నుంచి 8 నెలల వయసు కలిగి, తలమీద చర్మం ఊడి ఉన్న మగశిశువును గుర్తించాడు. దీంతో సచివాలయం వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న సవలం శ్రీరాములకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న శ్రీరాములు శిశువు మృతదేహాన్ని చూసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ జె.భీమశేఖర్ కేసు నమోదు చేశారు.

రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శుల నియామకం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం రోటరీ క్లబ్ (డిస్ట్రిక్ట్ 3020) అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ పి.ప్రభాకర్, కె.రామచంద్రరావు (సతీష్) నియమితులయ్యారు. మంగళవారం వీరితో పాటుగా మరో 30 మంది సభ్యులు టీం ఆఫ్ ఆఫీస్ బేరర్స్‌గా క్లబ్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి ఫిర్యాదు చేసినట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కాకి నాని తెలిపారు. తాడేపల్లిగూడెం, ఏలూరు నగరం శాంతినగర్‌లోని శశి కాలేజీల యాజమాన్యంపై ఫిర్యాదులు చేశామని, వీటిపై అలసత్వం వహిస్తున్న ఆర్ఐఓ చంద్రశేఖర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో ఎస్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశ నెరవేరేనా..!

కూటమి ప్రభుత్వం తమకు మరోసారి మొండిచెయ్యి చూపుతుందా అని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఇంటికీ ఉద్యోగం కల్పిస్తాం.. లేదా ఉపాధి కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇస్తాం అంటూ చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. గతంలో ఇదే మాదిరిగా హామీ ఇచ్చి తమను మోసం చేసిన చంద్రబాబును నిరుగ్యోగులు మరోసారి నమ్మి అధికారం కట్టబెట్టారు. తీరా ప్రభుత్వం ఏర్పడి నెల దాటినా పాలకులు నిరుద్యోగ భృతిపై నోరు మెదపకపోవడంతో నిరుద్యోగులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. అసలు నిరుద్యోగ భృతి ఇస్తారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



- నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపులు
- ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- మళ్లీ మోసం చేస్తారేమోనని ఆందోళన

చింతలపూడి: అధికారంలోకి వస్తే ఉద్యోగం లేనివారికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా ఉపాధి కల్పించే వరకు నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నమ్మి నిరుద్యోగులు పెద్ద ఎత్తున కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే విధి, విధానాల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే నిరుద్యోగ భృతి ప్రకటించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ప్రతి ఏటా కొన్ని వందల మంది ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగ వేటలో సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో తక్కువ వేతనాలైనా సరే ప్రైవేటు ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు దొరకని యువతకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి వస్తే ఉపాధి దొరికే వరకు తల్లిదండ్రులపై ఆధారపడే అవకాశం ఉండదు. 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం యువ నేస్తం పేరుతో నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రకటించి, అధికారం చేపట్టిన తరువాత ఎన్నికలకు ముందు సంవత్సరం 2018లో పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చి నెలకు వెయ్యి రూపాయల చొప్పున నిరుద్యోగులకు అందించి చేతులు దులుపుకున్నారు. దీంతో అప్పట్లోనే టీడీపీ ప్రభుత్వంపై నిరుద్యోగ యువత తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మళ్లీ అదే తరహాలో కాలయాపన చేస్తారా, ఒకవేళ ఇస్తే ఎప్పటి నుంచి ఇస్తారు, చివరకు ఎంత ఇస్తారనే దానిపై ఇంత వరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని అంటున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో సుమారు 1,06,666 గృహాలు ఉన్నాయి. ఇంటికో ఉద్యోగం కల్పించినా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారా అని నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

పోలవరంలో 30 వేల మందికి పైగా నిరుద్యోగులు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 30 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వీరంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్వారకాతిరుమల మండలంలో మొత్తం 32,326 గృహాలు ఉన్నాయి. ఇందులో డిగ్రీ, ఇంటర్మీడియెట్, డిప్లమో చదివి ఖాళీగా ఉన్న నిరుద్యోగులు వేలాది మంది ఉన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తానన్న ఇంటికో ఉద్యోగం గాని, నిరుద్యోగ భృతి గాని అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పటి వరకు దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వీరంతా ఆందోళనలో ఉన్నారు.

నెల రోజులు దాటినా..



ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతిపై ఇప్పటివరకు విధివిధానాలు నిర్ణయించలేదు. నిరుద్యోగ భృతితో వచ్చే సొమ్ము ఉద్యోగ ప్రయత్నాలకు వినియోగించుకునేందుకు వీలు కలుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ భృతి ప్రకటించే నాటికి ఉన్న బకాయిలు సైతం అందించాలి.

–టి.కరుణవరప్రసాద్, జంగారెడ్డిగూడెం

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



నేను గ్రాడ్యుయేషన్‌తో పాటు టీచర్ ట్రైనింగ్ చేశాను. ఉద్యోగం లేక కుటుంబ పోషణ కష్టంగా ఉంది. గతంలో మాదిరి కాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇవ్వటంతో పాటు, ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి. ప్రభుత్వం ఎప్పుడు ఇచ్చేది స్పష్టత ఇవ్వాలి.

–గుమ్మడి శ్రీనివాసరావు నిరుద్యోగి, జాగుడుగూడెం, కామవరపుకోట మండలం

నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి



నేను టీచర్ ట్రైనింగ్ (టీటీసీ) పూర్తి చేసి ఐదేళ్లు కావస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా త్వరగా డీఎస్సీ ప్రకటిస్తే మంచిది. అప్పటివరకు ప్రభుత్వం ఇస్తానన్న నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు అందించి ఆర్థికంగా ఆదుకోవాలి.

– ఎండీ సూరజ్ దౌల, నిరుద్యోగి, చింతలపూడి

ఎప్పుడిస్తారో చెప్పండి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా నెలకు రూ.3 వేలు నిరుద్యోగులకు భృతి ఎప్పుడిస్తారో చెప్పాలి. విధివిధానాలను కూడా ప్రకటించాలి. ఇప్పటికే భృతి కోసం నిరుద్యోగ యువత ఎదురు చూస్తుంది. అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించాలి.

బన్నే వినోద్‌కుమార్, పీడీఎస్‌యూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యక్షుడు, బుట్టాయగూడెం

ఆంక్షలు లేకుండా భృతి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇంటికో ఉద్యోగం గాని, నిరుద్యోగ భృతి గాని వెంటనే ఇవ్వాలి. వాటిని ఆంక్షలు లేకుండా అందిస్తారని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు భృతి ఇచ్చే విషయంలో అడుగులు ముందుకు వేయకపోవడం ఆందోళన కల్గిస్తుంది.

– ఘంటా అంజి, పంగిడిగూడెం, ద్వారకాతిరుమల మండలం

పేలుడు శబ్దాలతో కాలనీవాసుల భయాందోళన

జంగారెడ్డిగూడెం రూరల్: వేగవరంలో జగనన్న కాలనీ సమీపంలోని ఒక రైతు పొలంలో జరుగుతున్న మట్టి తోలకం పనుల్లో భాగంగా బండలను తొలగించేందుకు పేలుడు పదార్థాలను పెట్టి రాళ్లను బద్దలు కొడుతున్నారని, దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని, ఈ పనులను వెంటనే ఆపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మెషీన్లతో రంధ్రాలు ఏర్పాటు చేసి అందులో పేలుడు పదార్థాలను ఉంచి ఈ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాళ్లను పేల్చే క్రమంలో వచ్చే పెద్ద పెద్ద శబ్దాల కారణంగా కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారని, అలాగే భవనాలు కూడా అదురుతూ కూలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. అధికారులు చర్యలు చేపట్టి రాళ్లను పేల్చే చర్యలు ఆపాలని, లేకుండా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కలింపూడి సుందరరావు, సముద్రాల బాల సుందరం, బి.విక్రమ్, డి.కుమార్ హెచ్చరించారు.

ఏజెన్సీలో జోరుగా ఖరీఫ్ పనులు


వరినాట్లు వేస్తున్న మహిళలు


వరినాట్ల కోసం దమ్ము చేస్తున్న ట్రాక్టర్

- ముమ్మరంగా వరి నాట్లు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ
- నియోజకవర్గంలో 53,072.5 ఎకరాల్లో ఖరీఫ్ సాగు

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. గత కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనితో రైతులు పంట పొలాల్లో దమ్ము చేసి వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే బోరు ఉన్న రైతులు వరి నాట్ల పనులు వేయగా వర్షాధారం పైన ఆధారపడిన రైతులు కురిసిన వర్షాలతో పనులను ముమ్మరం చేశారు. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 53,072.5 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు పండించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే 30 శాతం వరి నాట్లు వేయడం జరిగిందని, మిగిలినవి నెలాఖరులోపు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నామని వ్యవసాయాధికారులు తెలిపారు.

37,967 ఎకరాల్లో వరిసాగు

నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 37,967.5 ఎకరాల్లో వరిసాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1182 ఎకరాల్లో వరి నారుమడులను రైతులు సిద్ధం చేశామని తెలిపారు. వరిసాగుతో పాటు జొన్నలు 27.5 ఎకరాలు, మొక్కజొన్న 1217.5 ఎకరాలు, సామలు 7 ఎకరాలు, పెసర్లు 57 ఎకరాలు, మినుములు 2032 ఎకరాలు, కందులు 50 ఎకరాలు, పశుగ్రాసం 2 ఎకరాలు, చెరకు 3497 ఎకరాలు, ప్రత్తి 7287 ఎకరాలు, వేరుశనగ 920 ఎకరాలు, పండించే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయాధికారులు చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం కూనవరం గ్రామానికి చెందిన బూర్ల శ్రీనుకి, ద్వారకాతిరుమల మండలంలోని రామసింగవరం గ్రామానికి చెందిన అనూషకు 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. కాగా చెడు వ్యసనాలకు బానిసైన శ్రీను అదనపు కట్నం తీసుకురావాలని తన భార్య అనూషను కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. శ్రీనుకి అతని కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, సూరమ్మ, సత్యనారాయణ సహకరిస్తున్నారు. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం అనూషను కొట్టి పుట్టింటికి పంపించేశాడు. అయితే ఆమె డబ్బు తీసుకుని రాకపోవడంతో శ్రీను రామసింగవరంలోని అత్తవారింటికి వచ్చి అనూషను బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మీకోసంలో వినతుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన ఎ.శ్రీనివాస్ తనకు గతంలో 200 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ వచ్చేదని, గత 6 నెలలుగా దీనిని నిలిపివేశారని, తనకు సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. అలాగే శ్రీనివాసపురానికి చెందిన టి.సర్వేశ్వరరావు గ్రామానికి చెందిన కొండపల్లి సంకురయ్యకు అనుమతిలేకుండా వేసిన విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖాధికారులకు ఎండార్స్ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ వైపు వినియోగదారుల చూపు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ప్రైవేట్ టెలికాం సంస్థలు తమ టారీఫ్‌లను పెంచిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి వినియోగదారులు ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లోకి మారేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి బీఎస్ఎన్ఎల్ సిమ్ కౌంటర్‌ల వద్ద వినియోగదారులు సోమవారం క్యూ కట్టడమే నిదర్శనం. ఇతర కంపెనీల సెల్ నెంబర్లను పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌లోకి మార్చుకుంటున్నారు. దీంతో నెట్ వర్క్ మాత్రమే మారుతుంది. వినియోగదారులు గతంలో వినియోగించిన సెల్ నెంబర్ యథాతథంగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా బీఎస్ఎన్‌లోకి మారేందుకు వినియోగదారులు వస్తున్నట్టు ఏలూరు నగరంలోని పలువురు ఫ్రాంచైజీల నిర్వాహకులు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది చెబుతున్నారు.

వసతి గృహాలకు నూతన భవనాలను నిర్మించండి


బుట్టాయగూడెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు, నాయకులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో ఉన్న గిరిజన బాలుర, బాలికల వసతిగృహాలకు నూతన భవనాలను నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. భూషణం మాట్లాడుతూ బుట్టాయగూడెంలోని గిరిజన బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకుని వర్షాల వల్ల పెచ్చులు ఊడిపడుతున్నాయని చెప్పారు. దీంతో విద్యార్థులు ఈ భవనంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి బాలుర, బాలికల వసతిగృహాలకు కొత్త భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ నాయకులు పి.వినోద్, పీవైఎల్ నాయకులు తగరం బాబూరావు, మడివి సిద్ధు, కె.ఐశ్వర్య, ఎస్.గాయత్రి, బి.దీక్షిత, బి.కార్తీక్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కుల గురించి తెలుసుకోండి


విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కలిగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి బాలికలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలు, బాల కార్మిక నిర్మూలనా చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, నిర్బంధ విద్య చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటితో పాటు ర్యాగింగ్ నిరోధక చట్టం, ట్రాఫిక్ ఉల్లంఘన చట్టాలను గురించి కూడా తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, న్యాయవాదులు పి శ్రీనివాసరావు, భవాని, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలి


రాజవరంలో డయేరియాపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా రాజవరం, గంగవరం గ్రామాల్లో సోమవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రమణ్యం మాట్లాడుతూ వర్షాకాలంలో అతిసార వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అతిసార వ్యాధి వల్ల శరీరంలో ఉన్న ఖనిజ లవణాలు వాంతులు, విరేచనాల రూపంలో బయటకి పోయి డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. ఆ సమయంలో తక్షణమే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని, వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే ఖాన్ బాషా, ఎం.సంధ్య, బి.శ్రీలక్ష్మి, ఆరోగ్య సహాయకులు వై.హరిబాబు, ఏఎన్ఎంలు క్రిష్ణకుమారి, ఎం.వెంకటకుమారి, జె సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 6వ తేదీన ప్రారంభమైన శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం శ్రీచక్ర అభిషేకం చేసి అనంతరం సహస్రనామార్చన చేశారు. అమ్మవారిని వారాహి మాతగా అలంకరించారు. ఈ సందర్భంగా చండీ సహిత లలితా హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి పంచహారతులు సమర్పించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


పద్మావతి దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ

కుక్కునూరు: స్థానిక ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బయో ఉత్పత్తులు ఎక్కడా దొరకలేదని ఏవో రెంటపల్లి బాలాజీ తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన జీ2 రిజిస్ట్రేషన్ ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలన్నారు. ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల శాంపిల్స్ నమూనాలను ప్రభుత్వ పరిశోధనలకు పంపుతున్నామన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


నగరంలో జగన్నాథుని రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. స్థానికలునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి శనివారపు పేట కాజీవే మీదుగా అశోక్ నగర్, పత్తేబాద రైతుబజారు, రామచంద్రరావు పేట మెయిన్ రోడ్డు, ఫైర్ స్టేషన్ సెంటర్, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా రామకోటి ప్రాంగణానికి యాత్ర చేరుకుంది. యాత్ర వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య సాగింది. సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామివారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించారు. అనంతరం జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు పంపిణీ చేశారు.